ఊరూ..వాడా.. వైద్య శిబిరాలు



మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



వైద్యశిబిరంలో సేవలు పొందేందుకు వచ్చిన ప్రజానీకం

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు తరలివస్తున్న ప్రజలు
- స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు
- వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఆనంద్ కుమార్ సహకారంతో ఉచిత భోజన సౌకర్యం

విశాఖ విద్య: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. పేదలకు చేరువలోనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సత్సంకల్పానికి అనుగుణంగా శిబిరాల నిర్వహణ జరుగుతోంది. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రతీ ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సేవలు పొందేలా వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో ముందుకెళ్తుండటంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి.

ప్రణాళికాబద్ధంగా శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. వార్డుల పరిధిలోని అన్ని కాలనీల వాసులకు సౌలభ్యంగా ఉండేలా వైద్య శిబిరాల షెడ్యూల్‌ను ప్రకటించి, ఏ రోజు ఏ కాలనీ వాసులు రావాలనేది ముందుగానే వలంటీర్ల ద్వారా స్లిప్పులను అందజేయటంతో ఏ చిన్నపాటి అసౌకర్యం లేకుండా వైద్య శిబిరాలు సజావుగా జరుగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని 14 వార్డుల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రతీ రోజూ ఒక్కోచోట రెండు నుంచి మూడు వందల మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో వైద్య శిబిరాలకు వచ్చే ప్రతీ ఒక్కరికీ రుచికరమైన భోజనం అందిస్తున్నారు.

ఇంటి ముంగిటకే స్పెషలిస్ట్ వైద్యులు

ఇంటి ముంగిటకే స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి ఉచితంగానే వైద్య పరీక్షలు చేస్తుండటంతో సేవలు పొందేందుకు అన్ని వర్గాల ప్రజలు తరలివస్తున్నారు. జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్టు, కంటి, దంత వైద్య నిపుణులు శిబిరాల్లో అందుబాటులో ఉండటంతో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. చిన్న పాటి జ్వరమో లేదా ఒళ్లు నొప్పులు వంటి ఆరోగ్య సంబంధిత వ్యాధులున్నా.. లేదా కంటి సమస్య, పంటినొప్పి, స్త్రీలకు సంబంధించిన స్పెషలిస్ట్ వైద్యుల వద్దకు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంతలేదన్నా వెయ్యి రూపాయలకు పైగానే ఖర్చు అవుతుంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సి వస్తే, ఆ ఖర్చు మరింత అదనం. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సేవలన్నీ ఉచితంగా అందుతుండటంపై ప్రజానీకం సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శిబిరంలో కూర్చునేందుకు ఏర్పాట్లు

పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



కాళ్లు నొప్పులు, తిమ్మిర్లతో బాధపడుతున్నాను. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే ఎంతో ఖర్చు. కానీ ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా మా కాలనీకే స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. డాక్టర్లు వస్తున్నారని ఒంట్లో ఏదైనా ఇబ్బంది ఉంటే చూపించుకోవచ్చని, మా వలంటీరు ఇంటికి వచ్చి చిట్టీ కూడా ఇచ్చారు.

– జి.శాంతి, సంజీవ్‌నగర్, ఎన్ఏడీ కూడలి

మా ఇంట్లో వాళ్లందరం వచ్చాం



మా కాలనీ పక్కనే ఉన్న సచివాలయానికి పెద్ద డాక్టర్లు వస్తున్నారని మా వలంటీర్ ఇంటికి వచ్చి చెప్పారు. మా ఇంట్లో వాళ్లందరం వచ్చాం. మాకు ఇక్కడ రక్త పరీక్షలు చేసి, అవసరమైన మందులు కూడా ఉచితంగానే ఇంచ్చారు. ఇది చాలా మంచి కార్యక్రమం.

– వై. పద్మ, అంబేడ్కర్ నగర్, 52వ వార్డు

ఏర్పాట్లు బాగున్నాయి



కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం అంటే, రద్దీగా ఉంటుందేమో, ఎలా అని భయపడ్డాం. కానీ ఇక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా డాక్టర్ల వద్దకే తీసుకెళ్లి వైద్యం చేయించేలా ఏర్పాట్లు చేశారు. వృద్ధులు వస్తే, ఇబ్బంది లేకుండా కుర్చీలు కూడా ఏర్పాటు చేశారు. అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నాం.

– జి.పార్వతి, గురజాడ నగర్, ఎన్ఏడీ కూడలి

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఆడారి ఆనంద్



ఐసీఐడీ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛమందించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం పరిస్థితిపై సీఎం వైఎస్ జగన్ ఆరా తీశారని ఆనంద్ కుమార్ తెలిపారు. - గోపాలపట్నం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: ట్రాఫిక్ నిబంధనలపై గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లోని పలు కళాశాలల్లో విద్యార్థులకు రహదారి నిబంధనలు తెలియజేశారు. గాయత్రి జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య కళాశాలల్లో విద్యార్థులతో సీఐ అశోక్ కుమార్ మాట్లాడారు. నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బెహరా భాస్కరరావుకు సత్కారం



బెహరా భాస్కరరావుకు సత్కరిస్తున్న స్థానికులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీ వాసులు జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును ఘనంగా సత్కరించారు. కాలనీలో పలు సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపించారని కొనియాడారు. ఇటీవల పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ రూ. 5లక్షలతో కమ్యూనిటీ హాలు మరమ్మతులు, కుమ్మరి వీధిలో షెడ్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన్ను తమ గుండెల్లో ఉంచుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కంపర కోటేశ్వరరావు, సీరపు శంకరరావు, బల్ల రమణ, భీమయ్య దేవుళ్లు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శత నామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అర్ధరాత్రి యువత ర్యాష్ డ్రైవింగ్

పోలీసుల స్పెషల్ డ్రైవ్



అర్ధరాత్రి వాహనాలు నడుపుతున్న వారిని ప్రశ్నిస్తున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: యువత అర్ధరాత్రి ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు యువకులు అర్ధరాత్రి తమ ప్రాంతాల్లో అతి వేగంగా ద్విచక్రవాహనాలను నడుపుతున్నారు. దీంతో మల్కాపురం పోలీసులు బుధ, గురువారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్ తదితర ప్రాంతాల్లో మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడుపుతున్న వారిని ప్రశ్నించి, వారి వద్ద పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి, వారి బంధువులను పిలిపించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ జి.డి.బాబుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో బోటు బోల్తా



దెబ్బతిన్న బోటు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోటు దెబ్బతినడంతో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని మత్స్యకార నాయకుడు సూరాడ ముత్యాలరావు చెప్పారు. గ్రామానికి చెందిన వాసుపల్లి తాతారావు, మారయ్య, వాసుపల్లి నల్లయ్య, అరిజిల్లి కుమార్, పరదేశి గురువారం తెల్లవారు జామున బోటుపై చేపల వేటకు వెళ్లారు. చేపల వేట ముగించుకుని తిరుగు వస్తున్నారు. అల్ప పీడన ద్రోణి ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు అలలు ఎగసిపడడంతో బోటు బోల్తా పడింది. సమీపంలోని రాళ్లను ఢీ కొట్టడడంతో విరిగిపోయింది. వల సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో మత్స్య కార్మికులు స్వల్పంగా గాయపడి.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఒడ్డుకు చేరారు. దెబ్బతిన్న బోటుపై 10 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

సర్వీస్ రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్

వాహనచోదకులు, పాదచారుల అవస్థలు




కల్యాణి ఆస్పత్రి ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ఇలా..



హెచ్‌పీసీఎల్ రక్షణ గోడను ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో పార్కు చేసిన భారీ వాహనాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీస్ రోడ్లపై భారీ వాహనాలను పార్క్ చేస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. మల్కాపురం నుంచి హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు వరకు వెళ్లే మార్గంలో, అలాగే మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ నుంచి కల్యాణి ఆస్పత్రి వరకు వచ్చేమార్గంలో భారీ వాహనాలను నిలిపివేస్తున్నారు. హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనులకు అవసరమైన సామగ్రిని తీసుకు వస్తున్న ఈ భారీ వాహనాలు రోజుల తరబడి ఇక్కడ నిలిపివేయడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి హెచ్‌పీసీఎల్‌కు భారీ వాహనాల ద్వారా సామగ్రిని తీసుకువచ్చే వాహనాలకు ఆ సంస్థ ప్రత్యేకమైన పార్కింగ్ సదుపాయం కల్పించాల్సి ఉంది. కానీ వారు ఈ విషయం పట్టించుకోకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఇప్పటికైనా సంస్థ యాజమాన్యం సమస్యపై దృష్టి సారించి, వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు. సర్వీస్ రోడ్డుపై వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ అధికారులు కూడా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు



రెక్టార్ సమతను సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న 30వ జాతీయ లిక్విడ్ క్రిస్టల్స్ జాతీయ సదస్సును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సర్ సీవీ రామన్ నుంచి స్ఫూర్తిని పొందిందని, తరువాత కాలంలో ఆయన శిష్యులు ఆచార్య సూరి భగవంతం బలమైన పునాదులు నిర్మించారన్నారు. నేడు భారత్ అణుశక్తి, అంతరిక్ష, ఐవోటీ రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధిస్తోందన్నారు. ఎల్‌సీడీల ఆవిష్కరణ తదనంతర మార్పులు వివరించారు. మూడు రోజుల సదస్సును పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఆర్‌ఐ ఎమిరిటస్ ప్రొఫెసర్ కేపీ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో పీసీ పతి చేసిన పరిశోధనలు, కృషిని వివరించారు. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య రవీంద్ర ధర్ మాట్లాడుతూ లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అందించే పలు అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య కె.బసవయ్య, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ నాంచారరావు ప్రసంగించారు. సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సినీ దర్శకుడు గోపీచంద్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. సినీ హీరో రవితేజతో తీసే సినిమా షూటింగ్ ఈనెల 15నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



పాల్గొన్న నాయకులు, క్లస్టర్ అధ్యక్షులు



మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ఓటర్ల నమోదుపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సూచించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య నేతలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రత్యర్థులు దొంగ ఓట్లు నమోదు చేసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని సూచించారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు సన్నద్ధం

త్వరలో నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ యాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేవిధంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్ఏ రహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్–4 సచివాలయ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం కొనసాగుతోంది. శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మాట్లాడుతూ పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో ఇప్పటికే దుర్గానగర్-4, గుడివాడ అప్పన్నకాలనీ సచివాలయ పరిధిలోని వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, టోకెన్లు ఇచ్చారన్నారు. ఆ టోకెన్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్నారన్నారు. రోగులకు మందులు అందించడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైన వారిని వేరే ఆస్పత్రులకు రిఫర్ చేసి, ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైన ప్రజలకు ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్





ఆహ్లాదకరంగా ఎన్ఎస్టీఎల్ కార్యాలయం, నివాసాల సముదాయం

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా స్పెషల్ క్యాంపైన్ ఫర్ డిస్పోజల్ ఆఫ్ పెండింగ్ మేటర్స్ 3.0 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ఎస్టీఎల్, క్వార్టర్స్ ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. క్లీనింగ్ డ్రైవ్, పార్కింగ్ స్థలాలు మెరుగుపరచడం, సుందరీకరణ పనులు చేశారు. కార్యాలయాల చుట్టూ సుమారు 500 మొక్కలు నాటారు. నివాస ప్రాంతాల్లో మురుగును తొలగించారు. కార్యాలయాల్లో 9,500 రికార్డులను సమీక్షించారు. 1000 చదరపు అడుగుల కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. పనికిరాని ఫర్నిచర్, మెటీరియల్‌తో పాటు ఐటీ వ్యర్థాలను విక్రయించి నగదు సమకూర్చారు. నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమాలను పరిశీలించిన ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ ఉద్యోగుల కృషిని అభినందించారు. కార్యక్రమాన్ని సీహెచ్ వి సత్య శ్రీనివాస్ సైంటిస్ట్ జి. గ్రూప్ డైరెక్టర్(వర్క్స్ అండ్ ఎస్టేట్), లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ డివిజన్ హెడ్(వర్క్స్ అండ్ ఎస్టేట్) సమీక్షించారు.

నేవీలో ఉద్యోగం పేరిట రూ.5.67 లక్షలకు టోకరా

తగరపువలస: నేవీలో తన కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని జీవీ అగ్రహారం(అప్పికొండవీధి)కి చెందిన ఆదిలక్ష్మి దఫదఫాలుగా తన నుంచి రూ.5,67,000 కాజేసి ఇప్పుడు ముఖం చాటేసిందని తోటవీధికి చెందిన గరుగు సావిత్రి ఆరోపిస్తోంది. బీఎస్సీ చదువుతున్న తన కుమార్తె కల్యాణికి నేవీలో మునీషా బేగం అనే మహిళ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ మొత్తాన్ని కాజేసినట్టు బాధితురాలు తెలిపింది. ఉద్యోగం కోసం మరో రూ.1.60 లక్షలు అడగటంతో మోసపోయినట్టు గుర్తించినట్టు చెప్పింది. దీనిపై గతంలో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా సెప్టెంబర్‌లో రూ.20 వేలు ఇచ్చి మిగిలిన వాయిదాలు చెల్లించలేదన్నారు. విడతల వారీగా డబ్బులు తిరిగి ఇస్తానని ఆదిలక్ష్మి పోలీసుల ముందు అంగీకారపత్రం ఇచ్చి.. ఇప్పుడు ముఖం చాటేస్తోందన్నారు. కుమార్తె ఉద్యోగం కోసం అప్పులు తెచ్చి మోసపోయానని, భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేస్తోంది.

డీసీసీబీల సేవలు అద్భుతం

లక్నో బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్



సబ్బవరం పరపతి సంఘం ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తున్న సీఈవో రమణ

సబ్బవరం: నాబార్డ్ సహకారంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అద్భుతమైన సేవలు అందిస్తున్నాయని లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్ కితాబునిచ్చారు. సబ్బవరం మండల కేంద్రంలోని శ్రీ దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని గురువారం లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా సొసైటీ సీఈవో గొంప రమణ లక్నో బృందానికి 32 గ్రామాల్లో విస్తరించి ఉన్న దుర్గమాంబ సొసైటీ రైతులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు గోల్డ్ లోన్ కూడా రైతులకు అందజేస్తున్నామని వివరించారు. రైతులకు అమలు చేస్తున్న వడ్డీ రేటు గురించి కూడా లక్నో బృందం అడిగి తెలుసుకుంది. తమ బృందంలో మిజోరాం ,ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ ,హరియాణ రాష్ట్రాల సహకార బ్యాంకు చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు కలిపి సుమారు 40 మంది సభ్యుల బృందం జిల్లాలో పర్యటిస్తుందని తెలిపారు. పర్యటనలో భాగంగా మునగపాక మండలం నాగులపల్లి వద్దగల తోటాడ గ్రామంలోరూ. 35 లక్షలతో నిర్మిస్తున్న గోదామును పరిశీలించామని తెలిపారు. ఈ పర్యటనలో అనకాపల్లి బెల్లం విశిష్టతను తెలుసుకున్నామని ఆయన వివరించారు. సబ్బవరం దుర్గమాంబ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలను ఆ బృందం ప్రశంసించింది. కేంద్ర సహకార బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పెంటకోట స్వామి నాయుడు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీవీఎస్ రామారావు, సబ్బవరం సొసైటీ పాలకవర్గ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య



కిశోర్ (ఫైల్)

పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు గౌతుల చ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్న గేదెల కిశోర్(18) అనే విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ అందించిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గేదెల వెంకటరావు భార్య, ఇద్దరు సంతానంతో ఉద్యోగ రీత్యా గౌతులచ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. వెంకటరావు ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు కిశోర్ షీలానగర్‌లోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కిశోర్ గురువారం ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం 5 గంటలకు అతడి చెల్లి అపరంజిని ఇంటి తలుపు తీయగా లోపల ఫ్యాన్‌కు ఉరివేసుకొని అన్నయ్య కనిపించడంతో తల్లికి చెప్పింది. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఫ్యానుకు వేలాడుతున్న కిశోర్‌ను కిందకు దించారు. కిశోర్ మృతి చెందడానికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడవుతాయని ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.